

# మూడవ అధ్యాయం

శ్రీకాంత్

*I am tired, that is clear*
*Because, at a certain stage, people have to be tired.*
*Of what I am tired, I do not know.*
*It would not serve me at all to know,*
*Since the tiredness stays just the same -*

**- Fernando Pessoa**

ఆమెకు అలసటగా వుంది చాలా చాలా విషయాలపై, చాలా సమయాలపై చాలా ప్రేమలపై కూడానూ. సాయంత్రం, ఆకాశం, కొద్దిగా కొట్టుకులాడుతున్న సూర్యపు కొవ్వొత్తి ఆఖరి వెలుతురు. సన్నటి మంటల్లా, భూమి నిశ్శబ్దమైన చెట్లతో మౌనంగా చెవులొగ్గి ఆకాశాన్ని వినేందుకు ప్రయత్నిస్తున్నట్టు గాలి లేదు.

ఆమె అలసటగా వచ్చి తలుపులు తీసి మంచంపై కూర్చుంది. కూర్చున్నాక, గదిలోని చీకటి గుర్తుకు వచ్చింది. లేచి లైటు వేసి ఓపిక లేక, అలాగే, దిండును మంచానికి అనుకుని వున్న గోడకు ఆన్చి, కాళ్ల జాపి అనుకుని కూర్చుంది. బహుశా, ప్రేమ ఎక్కడ అంతమవుతుందో లేదా ప్రేమ ఎక్కడ సంక్లిష్టంగా, చిక్కుముళ్ల సాలెగూడులా, పారదర్శకంగా కాక అస్పష్టంగా మారుతుందో అక్కడ అలసట మొదలవుతుంది. అలసట, వొక నిస్సత్తువ, అందరూ వుండి ఎవర్నీ తాకలేని నిస్సహాయపు నిర్లిప్తత. యింట్లో ఎవరూ లేరు.

యీ సమయంలో ఏం చేయాలి? బహుశా, గతంలో వొదిగిపోవాలి. నిస్సహాయంగా రాలిపోవాలి. వయస్సు కొన్నిటిని తనతోపాటు కలుపుకుని నిర్దయగా వెళ్లిపోతుంది. దేహంతో పాటు మనస్సూ వృద్ధాప్యంలో అడుగిడితే బావుండును. యిటువంటి గత సమయపు స్పర్శ స్పృహ వుండదు. మరొకరోజు మరొక సమయంలో యిటువంటి సాయంసమయంలో, ఆకాశం నల్లటి జలతారు పరదాను కప్పుకుంటున్న సమయంలో అతడు వుండేవాడు పక్కనే. దేహంపక్కగా, రక్తంపక్కగా, రక్తంలో, హృదయంలో. యిదే సమయం యిదేరోజు మరొక సమయంలో జీవంతో, ప్రేమతో, దేహం కొట్టుకులాడుతూ వుండేది. అతను ఆమెను ముద్దాడి చెప్పాడు.

నీవు లేకుండా నన్ను నేను వూహించుకోలేను.

ఆమె నవ్వింది మృదువుగా. ఆమెకు పైగా అతడి ముఖం. ముఖం కిందుగా ఆమె దేహంపై అతడి దేహం. ఆమెకళ్లు విప్పార్చి అతడి ముఖాన్ని గమనించింది. యితడు, యీ ముఖం, యీ దేహం తను ప్రేమించిన పరిచిత శరీరం. అతడి విశాలమైన కళ్లూ, కొనదేలిన ముక్కూ. అతడి దేహంలో మట్టివాసన. పొలందున్నేటపుడు లేదా వర్షంపడ్డాక మట్టి కదిలే వాసన. ఆమెకు ఆ సువాసన యిష్టం. స్వేదంతో చెమర్చిన అతడి దేహపు సువాసన ఇష్టం. ఆమె కళ్లు మూసుకుని అతడ్ని శ్వాసిస్తూ గమనించింది. పెళ్లయిన కొత్తల్లో, కొన్ని నెలల తరువాత, వొకరోజు వొక సమయంలో, అతడితో పడుకున్న క్షణాలలో ఆమె ఆకస్మికంగా వొక విషయం గమనించింది. ఆమె తన నయనాలను మూసుకుని అతడ్ని స్పష్టంగా చూడగలుగుతుందని, వొట్టి అతడి దేహపు సువాసనతో, ఆమె వుద్విగ్నంగా అతడ్ని శ్వాసించింది. ఆ సమయపు ఆరోజు నుంచి ఆమె అతడ్ని కళ్లు మూసుకుని చూడటం నేర్చుకుంది.

నేను నిన్ను ప్రేమిస్తున్నాను.

ఆమె మళ్లా నవ్వింది. అతడూ నవ్వి ఆమెను దగ్గరగా హత్తుకున్నాడు. ఆమె అడగాలనిపించి ఆగిపోయింది. నన్ను ఎందుకు ప్రేమిస్తున్నావు? రెండు

ప్రేమల మధ్య పోలిక వుండదు. అతడు ఆమెను ప్రేమించే ప్రేమకూ, ఆమె అతడ్ని ప్రేమించే ప్రేమకూ. కానీ, ప్రేమ ఎప్పుడూ వ్యక్తం చేయలేని వాటిలో జీవిస్తుంది. వ్యక్తం చేసే విషయాలు స్వల్పమైన భాగాలు. ప్రేమలో, దేహపు యుద్ధంలో. మరి, నేను అతడ్ని ఎందుకు ప్రేమిస్తున్నాను? సర్వం, అతడికై వొదులుకునేందుకు ఎందుకు సిద్ధపడ్డాను? సర్వం లేదా నేను సర్వం అనుకున్న వాటన్నిటినీ వొదులుకుని అతడికై ఎందుకు వచ్చేసాను? నిజానికి, నేను అతడ్ని మాత్రమే ఎందుకు ప్రేమిస్తున్నాను? ఆమె దేహం చలించింది. గాలి, కొద్దిగా కిటికీలోంచి చేతులు చాచి మునివేళ్లతో ఆమె నుదురుని తాకింది. ఆమె అలసటగా మంచంపై కదిలింది. కొన్నిసార్లు, అతడి స్పర్శ అలాగే వుంటుంది. కానీ, ప్రేమ? అంతిమంగా బాధనెందుకు వొదిలివెడుతుంది? నిశ్శబ్దంగా యీ దేహాన్ని వొక యుద్ధ ప్రదేశాన్ని ఎందుకు చేస్తుంది? ఆమె అసహనంగానూ, అలసటగానూ మంచంపై కదిలింది. ఆకస్మికంగా ఆమెకు కొన్ని రోజుల క్రితం, తను యింటికి అలసటగా చేరిప్పుడు, సాయంత్రం రెండు సంపూర్ణమైన స్వచ్ఛమైన వదనాలు కనిపించినాయి. ప్రేమతో చలిస్తూ. వొకటి తన కొడుకుది, మరొకటి వొక అమ్మాయిది. తనకు పరిచితమైన అమ్మాయిది. ఆమె అశాంతిగా మారింది. అతడ్ని, తన కొడుకుని మందలించింది. యీ సమయంలో ఆ అమ్మాయి ఎందుకు యిక్కడ వుండింది? ఆమెకు అర్థం కాకకాదు, కానీ ఎందుకు ఆ క్షణంలో యిద్దర్నీ చూసిన క్షణంలో అశాంతిగా కదలాడింది? ఆకస్మికంగా, ఆమె గ్రహించింది. తన యిరవై ఏళ్ల క్రితపు ప్రేమమయపు రక్త చలనభరిత వుద్రేకపు జీవితం ఆ యిద్దరి ముఖాలలోనూ గ్రహించింది. ఆ అమ్మాయి ముఖంలో, లేదా ఆ అమ్మాయి రూపంలో తన రూపం, తన తనయుడి ముఖంలో అతడి తండ్రి రూపమూ కదలాడినాయి. అశాంతి, అలసట, రెండు దేహాలు ఆమె ముందు పక్షుల్లా లేదా నీటిపై తేలే తూనీగల్లా కొట్టుకులాడినాయి. రెండు యవ్వనపు దేహాలు. స్వచ్ఛమైన మహోద్రేకమైన రక్తం. ఆ రెండు దేహాలు. ఆమె వూహించేందుకు ప్రయత్నించింది. తన కొడుకూ, ఆ అమ్మాయి నగ్నదేహాలనూ, ప్రేమతో, వొకరి దేహంపై మరొకరికి వుండే అమితమైన వాంఛతో అల్లుకునే కౌగిళ్లనూ, వొక వున్మాదపు ముద్దులనూ వూహించేందుకు ప్రయత్నించింది. చివరకు, ఆమె గ్రహించిందల్లా ఆ యిద్దరి రూపాలు మాయమయ్యి, వాటి స్థానాలలో తన రూపమూ, తన భర్త రూపమూ ప్రత్యక్షమైనాయి. ఆమె తన కొడుకునూ, అతడి ప్రియురాలనూ ప్రేమిస్తూ వూహించేందుకు ప్రయత్నిస్తూ అదే సమయంలో తననూ, తన భర్తను లిఖిస్తుందని. వొకే సమయంలో రెండు రూపాలలో నలుగుర్ని చూడగలగడం. కొద్ది సమయం తరువాత అస్థిత్వాలు మాయమయ్యి రెండు ప్రేమించే దేహాలు మాత్రమే మిగిలినాయి.

మళ్లా అసహనం.

మునుపటిలా లేనందుకు. మునుపటి సమయాలు లేకపోవడం. మునుపటి సమయాల గుర్తులు మాత్రమే మిగలడం. వయసు చరిత్రలతో కలగలిసి వర్తమానంతో చేసే యుద్ధం కూడానూ. ప్రేమించినందుకు చివరకు ఏం మిగులుతుంది? లేదా ఏదైనా మిగలాలని ప్రేమించినపుడు లేదా మరింత సూక్ష్మంగా రక్తంలో యింకిపోయిన ప్రేమ సమయాలు మిగలాలని ప్రేమించినపుడు ఏం మిగులుతుంది? నిజానికి, ప్రేమించినపుడు, వొక వుధృత వున్మాద రక్త ప్రవాహంలో కొట్టుకుపోతున్నప్పుడు ఏం మిగులుతుందనే దాని గురించి ఆలోచిస్తామా? ఆలోచించగలుగుతామా? సర్వమూ క్లుప్తమై, బాధ, దుఃఖమూ, నిరాశ, నిస్సహాయత, నిర్లిప్తత, విషాదమూ, గతం ద్వారా వచ్చే సువాసనా, ఆ సువాసన ద్వారా వచ్చే మనస్సులోని కాంతి, మనస్సులోని కాంతి ద్వారా కళ్లలోకి పాకే జీవధార, కళ్లలోని జీవధార నెమ్మదిగా పెదాలపై జారి చిర్నవ్వుగా మారే జీవితమూ, సర్వమూ క్లుప్తమై వొక మనిషిలా, వొక వునికిలానూ పరావర్తనం చెందుతుంది. సమయాలు. సుదీర్ఘమైన జీవితం. వొక అనుభవం నుంచి మొదలయ్యి అనేకానేక అనుభవాలుగా మిళితమయ్యి క్రమంగా అనేకానేక అనుభవాలుగా చీలిపోయి, నెమ్మదిగా, భారంగా మృదుకఠినంగా సాగే జీవితం. చివరకు జీవితం అదేకావొచ్చు. ఆకాశం నెమ్మదిగా మేఘావృతమవుతుంది. కనిపించీ కనిపించకుండా, క్రమక్రమంగా పెరుగుతున్న గాలికి, తమను చుట్టుకుంటున్న విసురుకు, కనిపించీ కనిపించకుండా బలహీనంగా ఆకులు చెట్ల నుంచి నెమ్మదిగా వీడిపోయి నలుదిశలా తేలిపోతున్నాయి. వర్షం కురుస్తుందా? యీ ఆకాశం. యిది ఎప్పటికీ వర్షించకపోవచ్చు. ప్రతిసారీ వర్షించేంతగా మేఘావృతమయ్యి చివరకు వర్షించకుండా వుగ్గబట్టుకుని నిలబడిపోతుండవచ్చు.

మరింతగా చీకటి గాఢమైన సముద్రంలా అదృశ్యంగా కమ్ముకుంటుంది. లేవాలి. లేచి కదులాడాలి. దేహం లోపలి మిగిలివున్న శక్తినంతా కూడగట్టుకొని

భారంగా లేచి నిలబడాలి. లేచి కదులాడాలి. యీ చీకటిలో, యీ జీవితంలో ముందుకు సాగాలి. మనుషుల్ని ప్రేమించినపుడు మిగిలే జీవితపు శిక్ష. తప్పని శిక్ష. లేవాలి. యీ గోడల నిండా వెలుగుని అలకాలి. లైట్ స్విచ్ వేయాలి. యీ గోడల మధ్య. అన్నీ వుండి ఏమీ లేని, వొక కోల్పోయినతనపు స్పృహ వూగిసలాడే యీ గోడల మధ్య కదులాడాలి. యీ దేహంతోటీ, యీ మనస్సుతోటీ యీ రాత్రి నుంచి మరో పగటిలోకి నడవాలి. లేవాలి. పనిమనిషి వచ్చి వెళ్లిందా? లేకపోతే అంట్లన్నీ తోమాలి. యింటి వెనుక, జామచెట్టు నయనాల కింద, కొద్దిగా పక్కగా కట్టిన తొట్టి పక్కగా, వుదయం నుంచి అలా పడి వున్న అంట్లను స్పర్శించాలి. కడిగి, నీళ్లతో యీ హస్తాలతోకడిగి, తిరిగి గోడల మధ్యగా సాగాలి. ఎవరికోసమో వండాలి. కడిగి, బియ్యాన్ని నీళ్లతోనూ, యీ హస్తాలతోనూ కడిగి, గిన్నెలో మళ్లీ నీళ్ల మధ్యలో వాటిని వుడికించాలి. బహుశా, ప్రేమ కూడా యిదే కావొచ్చు. యీ దేహంతోటీ, యీ మనస్సుతోటీ ప్రేమ వుండీలేని వర్తమానంలోంచి గతం లాంటి భవిష్యత్తులోకి నడవాలి. లేవాలి. బహుశా, ప్రేమను కూడా పరిశుభ్రం చేసుకోవాలి. తోమాల్సిన అంట్లలాగా, స్పర్శించి, యీ చర్యల నీళ్లతోనూ యీ హస్తాల స్పర్శతోనూ కడిగి, తిరిగి, కదలాలి జీవితంలోకి. బియ్యాన్ని నీళ్లతో కడిగి మరో జన్మనిచ్చినట్టుగా, మరో ఆకలిభరిత కడుపుకు అన్నం పెట్టినట్టుగా, యీ జీవితంలోకి ముందుకు సాగాలి. కానీ, అది కొంత బాధ, కొంత నొప్పి, కొంత సంఘర్షణ. తప్పదు లేవాలి, కదలాలి.

*ఎప్పుడూ వెనకంజ వేయకు. ఎప్పుడూ.. జీవితంలో ఎప్పుడూ భయపడకు. బహుశా, సమయాలుంటాయి, కఠినభరితమైన సమయాలు. వొట్టి బాధ తప్ప మరేమీ లేని రోజులు. వొట్టి నిరాదరణ తప్ప మరేమీ దొరకని రోజులు. ఆగిపోకూడదు. బహుశా, జీవితం యిటువంటి బాధలోంచి, నిరాదరణలోంచి మొదలవుతుంది. నెమ్మదిగా, సూర్యరశ్మిలో సూర్యరశ్మితో పాటు సూర్యరశ్మిలా ఎదిగే మొక్కలానూ, మొక్క నుంచి వృక్షంగానూ, వృక్షం నుంచి పదిమందికి నీడనిచ్చే, ఎవరి నుంచి ఏమీ ఆశించని మాట్లాడక మాట్లాడే నిశ్శబ్ద చంచలభరిత ఆకుల, కొమ్మల, పూల, పక్షుల స్థావరంలానూ జీవితం మారుతుంది.*

ఆమె లేచి వెళ్లి లైటు వేసింది.

ఎక్కడ వుండాల్సిన వస్తువులు అక్కడ. ఎప్పటిలాగే. అనేకానేక రోజుల్లాగే, అనేకానేక సమయాల లాగే. మునుపటి గోడలు, తెల్లగా, అక్కడక్కడా ఎర్రగా ఎండి అతుక్కున్న దోమలతో, మునుపటిలాగే గోడలు. కొన్ని సార్లు జీవితమూ యీ గోడల్లాగే మారుతుంటుంది. నిశ్శబ్దపు ప్రేక్షకుల్లా, అన్నీ గమనిస్తూ, ఏమీ సంభాషించనట్టుగా. కానీ, వొదలని కొంత బాధ. కొంత నొప్పి, కొంత సంఘర్షణ. కానీ ఎక్కడ యీ లయ తెగిపోయింది? జీవిత పాదాల లయబద్ధపు నృత్య కదలిక? వొక కారణం కాక అనేకానేకకారణాలు, అనేకానేక సమయాలు కలగలిసి, నెమ్మదిగా, క్రమక్రమంగా జీవితం జీవంతోకాక, యిప్పటి సమయాలూ, యిప్పటి పదాలూ, యిప్పటి ప్రేమలతో కాక, మునుపటి సమయాలతోనూ, పదాలతోనూ, ప్రేమలతోనూ నిండిపోయింది.

*శాశ్వతమైనదేదీ లేదు. శాశ్వతమనేది మరణానికి చిహ్నం లేదా జీవం లేని వస్తువులకు చెందిన అంశం అది. యిదిగో, ఈ గోడలు లేదా యీ యినప బీరువా వొక సుదీర్ఘమైన కాలంలో మన్నగలదు. కానీ జీవంతో చిందేదేదీ సుదీర్ఘమైన కాలంలో అదే విధంగా నిలబడ లేదు. అది మారుతుంది. నువ్వు దేనినైనా గమనించు. దశలు. వొక దశ నుంచి మరో దశ వుంటుంది. వొక విధమైన సుస్థిరత్వంతో వుండినదేదీ లేదు. చెట్లను గమనించు. మొక్కలను, పూవులనూ కూడా. అశాశ్వతమైన మార్పు గల గుణమే వాటికి జీవితాన్నిస్తుంది అలాగే ప్రేమ కూడా.*

ఆమె తనయుడు భవిష్యత్తులో రాశాడు. ఆమె యీ వాక్యాలు గతంలో రాసుకోలేదు. ఆమె లేచి వంటగదివైపు కదులుతుండగా ఆకస్మికంగా తట్టింది. తనెందుకు, వీటిని సహజంగా తీసుకోలేకపోతుంది. ఎటువంటి ధ్వంసం లేకుండా లేదా ఏ వ్యక్తి ధ్వంసం కాకుండా, ఆ ధ్వంసంలోంచి మరొక జీవితం ఆరంభమవ్వకపోతే అది ప్రేమెలా అవుతుంది? కానీ, యీ బాధ? కానీ, ఈ నిరాదరణ, దుఃఖం, తన తల్లి ఇలాగే, తనకంటే కఠినమైన జీవితంతో ఈదులాడింది. వొక యిచ్ఛలేక, ఆశలేక జీవితమంతా తన్నుకు లాడింది. లేదా తనదైన యిచ్ఛలేక, ఆశలు లేక, తనకంటూ ఏమీ లేక, ఇంకా తన్నుకులాడుతుంది. వూపిరందని ఆస్మా వూబిలో గిలగిలలాడుతుంది.

ఆమె మధ్య గదిలోకి వెళ్లి లైటు వేసి, తరువాత వంటగదిలో కూడా లైటు వేసింది. ఏమైనా కొత్తగా వుందా? ఏ వొక్క వస్తువైనా? కనీసం, స్పర్శించే హస్తాలకైనా? గట్టు, ఎడమవైపుగా సిమెంట్ అరలు. డబ్బాలు. గట్టు పైన స్టవ్. పక్కగా గిన్నెలు. గట్టుకిందుగా ఓ పక్కగా మట్టికుండలూ, వొక స్టీలు బిందె. వాటికి

కిందుగా కడగవలసిన మూడు ప్లేట్లు, వొక పాలగిన్నె. అవి ఆమె వంక అలవాటైన కళ్లతో చూసాయి. ఆమె వాటివంక నిర్లిప్తభరితమైన, అలవాటైన కనులతో చూసింది. యిది వేడిమి. వొకరికి వండి వడ్డించడంలోని ఆనందం ఎప్పుడు మాయమవుతుంది? దగ్గరుండి వడ్డించడం ఆనందం. కలిసి భోజనం చేయడం ఆనందం. తను మరొకరిలో చూసుకుంటూ లేదూ తనే మరొకరిగా మారిపోయి మాటతోనూ, పరిచితమైన చిర్నవ్వుతోనూ, పొలమారినప్పుడు హడావుడిగా నోటికి మంచినీళ్లు అందించడం ఆనందం. గది చిన్నదే. ఏమీ లేదప్పుడు. అద్దె ఇల్లు, రెండు గదులు. మంచం కూడా కాదు. నేల పైన. దుప్పట్లు, దిండు, శీతాకాలపు రాత్రుళ్లు. మాటలు. ఏమిటవి? మాటలుకూడా కావు. బహుశా, శబ్దాలు, దేహంలోపలకు, రక్తంలోంచి నరాల్లోకి, చర్మం పొరల్లోంచి గుండెలోకి కలియ తిరుగుతూ కదులాడే సీతాకోకచిలుకలు. శబ్దాలు, స్పర్శ. దగ్గరగా ప్రేమగానూ, వుద్రేకం కాదు. శాంతిభరితమైన వుద్వేగం. ఏమిటది? ఆ క్షణాలనూ, సమయాలనూ చలి మంటలా రగిల్చినది ఏమిటి? జీవితంపట్ల విశ్వాసమా? వొకరిపై మరొకరిపై ప్రేమా? కాదు. మరేమిటి? బహుశా, వూహించిన మహాద్భుతమైన, విస్తృతమైన, శాంతిభరితమైన, అదే సమయంలో వూహకందని జీవితం నిజంగా మారటం కావొచ్చు. అతడు ఆమె వూహల్లోనూ, వూహల్లోంచి ఆమె వూహించినట్టుగా జీవించటం కావొచ్చు. రెండూ కలగలిసి వొక అసంఖ్యాక పరివ్యాప్తమైన జీవితపు వర్షంలా తమ చుట్టూ తామే వర్షించటం కావొచ్చు. మళ్లా తామే భూమై, తమ వర్షానికి తామే తడిసి, అందులో ఆ సారవంతమైన నల్లటి మట్టి జీవితంలో కలలు నాటుకుని, మొక్కలు మొలకెత్తి, ఎదిగి, మొక్కల మృదుహస్తాలలోంచి పూలు విచ్చుకునే దృశ్యాన్ని గమనించడం కావొచ్చు. అది జీవితం లేదా జీవితంలోని ముఖ్యమైన జీవితం. మరి, యిదంతా ఏ క్షణాన వురి వేయబడింది? వయసుతో పాటు ప్రేమ తెరమరుగవుతుందా? వయసుతో పాటు ప్రేమ అస్పష్టంగా మారుతుందా? రెండోది స్పష్టమైన కారణం కావొచ్చు.

*తొందరగా వచ్చేయి. నీకోసం ఎదురు*
*చూస్తుంటాను.*
*త్వరగా వచ్చేయటానికి ప్రయత్నిస్తాను.*
*ఎదురుచూడకు.*
*ఆలస్యం అయితే నువ్వు భోజనం చేసేయి -*

పెదాలపై దీర్ఘమైన పెదాల వొత్తిడి. భుజాల చుట్టూ చేతుల వొత్తిడి. చేతుల్ని అనుకుని వెంటాడే గాజుల శబ్దం. దేహం దేహానికి అనుకుని త్వరగా వచ్చేయమని చెప్పటం. అప్పుడు, దేహం ఏమయ్యింది? వొక మహా సముద్రంలా మారింది. ఆకాశ సముద్రంలా, విశాలంగా, సర్వ సమస్త శక్తులనూ తనలో యిముడ్చుకున్న ప్రకృతి సముద్రంలానూ మారింది. యిదొక చరిత్ర. యిద్దరికి సంబంధించిన చరిత్ర కాదు. బహుశా, ప్రతి స్త్రీ ప్రతి పురుషుడికీ సంబంధించిన చరిత్ర. త్వరగా రమ్మనే చరిత్ర. నీ దేహం కోసం నా దేహం ఎదురు చూస్తుందనే చరిత్ర. నీ కలల కోసం నా కలలు ఎదురు చూస్తాయనే చరిత్ర. నీ మాటల కోసం, నీ శబ్దాల కోసం, నా మాటల శబ్దాలు ఎదురు చూస్తాయనే చరిత్ర. తొందరగా వచ్చేయమని ఆమె చెబుతున్నప్పుడూ, త్వరగా వచ్చేస్తానని అతడు చెబుతున్నప్పుడూ, యిద్దరికీ బహుశా తమ కళ్లల్లో కొట్టుకులాడుతున్న అసంఖ్యాకమైన కలల్లా, తప్పక తెలుసు- ఖచ్చితంగా, రావటం ఆలస్యమవుతుందని లేదా రాకపోవచ్చునని కూడా. మరి ఎందుకు చెప్పడం? వొక గాఢమైన వాంఛను వ్యక్తం చేయడం- ఆమె. నేను, నా మటుకు నాకు రావాలనే వుంటుంది. కానీ రాలేను. మరికొన్ని విషయాలుంటాయి. ప్రజల జీవితంలా- అతడు. మరి ఎందుకు అడగటం? వొక బలమైన వాంఛ. వొక బలమైన కోరిక లేదా వొక బలీయమైన ప్రయత్నం. వ్యక్తిగత జీవితానికీ, పబ్లిక్ జీవితానికీ మధ్య శూన్యాన్నీ పూడ్చే ప్రయత్నం.

ఆమె వంటగది తలుపు తెరిచి, అంట్లన్నిటినీ యింటి వెనుక వున్న నీటితొట్టి పక్కనున్న మోరిలో ఎదురు చూస్తున్న మరిన్ని గిన్నెల పక్కన వేసింది. అస్థిమితమైన ఆలోచనలు. అస్థిమితమైన సమయాలు. జీవితంలా పద్ధతి లేక వుండిన జ్ఞాపకాల్లా- చివరకు యీ అంట్లు కూడా. వంటగది, దానితో ముడిపడి వున్న యీ దేహమూ, దేహంతో ముడిపడి వున్న అంట్లూ, అంట్లతో ముడిపడి వున్న బియ్యమూ, బియ్యంతో కలగలిసిన నీళ్లూ, నీళ్ల కింద మంట. చరిత్ర పునరావృతమయ్యే చరిత్ర. ప్రతిరోజూ, పునరావృతమయ్యే వంటగది వంటలాటి చరిత్ర. చరిత్ర చరిత్రలలో మరొకటి లేదు. యీ చరిత్ర ఎవరు రాస్తారు. ఆమె యథాలాపంగా మోరీ పక్కగా వున్న రాతిపలకపై కూర్చుంది. తల మీదుగా కొద్ది ఎత్తులో తలపైకి వొంగిన జామచెట్టు యింటి వెనుక వున్న బల్బు కాంతిలో నేలపైకి నల్లటి ఆకుల్లానూ, కొమ్మల్లానూ గాలిలానూ జారుతుంది. ఆమె తదేకంగా నీడలను గమనించింది. సౌందర్యవంతమైన నీడలు. బాల్యంలో వాటితో ఆటలాడింది. ఎప్పుడు? యింటి బయట- నలభై ఏడేళ్ల క్రితం- యింటి పక్కగా వున్న జామచెట్టు వద్ద రాత్రిపూట వేసి

వున్న మంచంపై కూర్చుని అర్ధాకారపు చంద్రుని మసక వెలుతురుల మసకనీడలను గమనిస్తూ ఆటలాడింది. కానీ, అది బాల్యం, సౌందర్యపు వొక అంచు మాత్రమే చూడగలిగింది అప్పుడు. మనోహరమైన అంచు అది. గాయపర్చలేని అంచు. చాలా సంవత్సరాల తర్వాత, అతడితో పరిచయమయ్యాక వూరి నుండి స్వతంత్రంగా బతికేందుకు పట్నం వచ్చాక, వొక చిన్న యిల్లు అద్దెకు తీసుకుని రాత్రిపూట కిటికీలోంచి పడుతున్న వెన్నెలను, దానితో కదులాడిన కిటికీ వూచల నీడలనూ గమని స్తున్నప్పుడు మాత్రమే ఆమెకు వెన్నెలతో తడిసిన నీడల మరొక రూపం తెలిసింది. చదువరీ, నీకు తెలుసా? సౌందర్యపు మరో అంచు ఏమిటో?

'హింస', ఆమె అనుకుంది 'ఎందుకు నాకింత దుఃఖం? ఎందుకు నాకింత నిరాదరణ. ప్రేమ నెమ్మది గా అదృశ్యమవుతున్నందుకా లేక ప్రేమ మునుపటిలా చలించనందుకా?' మృదువుగా హృదయాన్ని అరచేతి లోకి తీసుకుని నెమ్మది నెమ్మదిగా పదునైన ఆయుధం తో గాట్లు పెడుతున్న దుఃఖం. ఆమె నిర్వికారంగా అంట్లు తోమడం మొదలుపెట్టింది. చాలా సహజంగా. సహజం అసహజంగా మారినంత సహజంగా. ప్రేమ బలహీనమైనప్పుడు, నువ్వు కూడా బలహీనమైన రూపం లా మారిపోతావా? నెమ్మదిగా, వొక సర్పంలా, అప్పు డెప్పుడో, యింటిముందు చంపిన పాములా, చుట్టూ మనుష్యులు కర్రలతో కమ్ముకుని, కర్రలతో బలంగా చరచినప్పుడు, బలహీనంగా కదులుతూ మెలికలు తిరుగుతూ, చివరకు నిశ్చలంగా నిలిచిపోయినా, కర్రతో మరోసారి నొక్కినప్పుడు, చనిపోయిన దానిలో చివరిగా మిగిలివున్న జీవమేదో కదులాడినట్టు, స్వల్పంగా కదిలే సర్పపు తోకలా - యీ దేహం సర్పంలా మారుతుందా? దేహసర్పం. విషరహిత సర్పం. చెట్లపై, పచ్చటి ఆకు లపై పచ్చటి సూర్యకిరణంలా కదులాడే పసిరిక పాము. యీ దేహం, తను ఎందుకు బలహీనంగా అనుభూతి చెందుతుంది? బలహీనంగా, శూన్యపు ప్రదేశంలా, దేహంలో ముఖ్యమైన అంశమేదో ఆకస్మికంగా మాయమైనట్టు? కానీ, ప్రేమ ఏమిటి? దేహమా? కలిసి వుండటమా? యిద్దరి ఆలోచనలూ, అనుభవాలూ, మూర్ఖపు చర్యలూ, సాంద్రమైన స్పర్శలూ, ఇంకా, ఇంకా, ఇంకా, ఇంకా... అనేకానేకమైన, అసంఖ్యాకమైన చర్యలు కలవటమా? కానీ, తను ఎందుకు బలహీనం గా అనుభూతి చెందుతుంది?

రోజు తరువాత రోజు. యిదే పునరావృతంతో, యిదే మార్పులేని చర్యలతో ఆకస్మికంగా ఆమెకు, తనకూ, తన ఎదురుగా పాదాల వద్ద వున్న కడగాల్సిన గిన్నెలకూ సంబంధం వుందనిపించింది. వాటికీ, తనకూ తేడా వుందా? వండుకోవడానికి వుపయోగించటం, మరొకరిని సంతోషపెట్టేందుకు ప్రయత్నించడం, రాత్రికి అలసిన దేహంతోటీ, మనస్సుతోటీ వాటిని శుభ్రంచేసి, మరోరోజుకు సిద్ధం చేయడం. తేడా, ఎక్కడ! తన దేహం వొక గిన్నెలా మారుతోందా, లేక మారిందా?

లేదు. దేహం వృద్ధాప్యపు మట్టిలా మారింది. రైతులా, వృద్ధరైతులా. జీవితమంతా సాగుచేసి శ్రమ తప్ప పూటకు తిండి కూడా మిగిల్చుకోలేని రైతులా. బహుశా, ప్రేమ కూడా బొటనవేలంత భూమిని కూడా మిగుల్చుకోలేని, ముప్పై ఏళ్లుగా శ్రమించిన రైతు కావొచ్చు. అంతిమంగా ఏమీ వుండదు. జీవితకాల మంతా సంఘర్షించిన జీవితం తప్ప. శ్రమ తప్ప. లేదా శకలాలుగా పగిలిన జ్ఞాపకం తప్ప. అది అద్దం కూడా. అరచేతిలోంచి అనుకోకుండా నేలపై జారిపడి ముక్కల యిన అద్దం. మిగిలేదంతా సమగ్రమైన చిత్రం కాక, అసంఖ్యాకంగా విస్తరించుకున్న ఖండికలుగా చెల్లా చెదురైన ప్రతీకలు కావొచ్చును. యిక్కడొక తునక, అక్కడొకటి. నువ్వు, నీ జీవితమంతా తిరిగి ఏరుకున్నా సంపూర్ణంగా ఏమీ మిగలదు. అసంపూర్ణమే సంపూర్ణ మైన సంతకం.

వొక ఆకస్మిక విసుగుతోనూ, దేహాన్నంతా విస్త రించుకుంటున్న గతాన్నీ, ప్రస్తుతాన్నీ విదుల్చుకోవ టానికి, ఆమె ఆకస్మికంగా ఏకాగ్రతతో అంట్లను కడగటం మొదలుపెట్టింది. Nothing exists outside itself, then. గిన్నెలను కడగటం వొక్కటే. ముందుగా నీళ్లతో తడిపి, ఆ పై బూడిదతోనూ, కొబ్బరి పీచుతోనూ శుభ్రం చేసి, తిరిగి నీళ్లతో శుభ్రం చేసే చర్య వొక్కటే. పది నిమిషాలలో ఆమె అంట్లను కడగటం పూర్తిచేసి, గిన్నెలను మోరీ పక్కగా వున్న రాతిపలకపై బోర్లించి, లేచి, పమిటతో ముఖాన్ని తుడుచుకుంటూ ఆకాశం లోకి చూసింది. జామకొమ్మల ఆకుల మధ్యగా అర్ధ ప్రశాంత వెన్నెల. అది శుభ్రం చేసి బోర్లించిన గిన్నె. ఆమె అర్ధ జాబిలి వంక సుదీర్ఘంగా చూసి యింటి లోపలికి కదలింది. ఆమె శుభ్రం చేయకుండా వొదలివేసిన గిన్నె వొకటి మిగిలిపోయింది. దానిని పదిలంగా ఆమె హస్తాల మధ్యగా యివ్వవచ్చు.

అది నీ హృదయం.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 జూన్ 2000*